నేటి నుంచి ఎస్ఏ-1 పరీక్షలు

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 4: జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గురువారం నుంచి ఎస్ఏ-1(సమ్మెటివ్ అసెస్‌మెంట్) పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో సోమశేఖరశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రశ్నాపత్రాలను సంబంధిత కీ సెంటర్ల నుంచి ప్రధానోపాధ్యాయులు తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. 7, 9వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం పరీక్షలు జరగనుండగా, మిగిలిన తరగతుల విద్యార్థులకు ఉదయం పరీక్షలు నిర్వహించాలని, షెడ్యూల్‌ను ప్రతి ఒక్కరూ పాటించాలని స్పష్టం చేశారు.

అండర్-17 ఖో ఖో జట్టు ఎంపిక

ఉమ్మడి జిల్లా ఖో ఖో జట్టు సభ్యులతో నిర్వాహకులు

ఖమ్మం సిటీ, అక్టోబర్ 4: ఉమ్మడి జిల్లా అండర్-17 ఖోఖో జట్టు ఎంపిక పూర్తయింది. ప్రతిభ కనపరచిన 15 మంది క్రీడాకారులను బుధవారం ఎంపిక చేశారు. వారం రోజుల నుంచి సర్దార్ పటేల్ స్టేడియంలో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల నుంచి మొత్తం 165 జట్లు ఎంపికలో పాల్గొనగా వారి నుంచి తుది జట్టు ఎంపిక ఖరారు చేశారు. ఈ నెల 13నుంచి16 వరకు మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో ఖో ఖో రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయి. అతిథులుగా డీఈవో సోమశేఖరశర్మ, ఫిజికల్ డైరక్టర్ సెలక్షన్ ఎన్‌సీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ,కోఆర్డినేటర్ పసుపులేటి రాఘవయ్య, సభ్యులు నరసయ్య, రామారావు, కృష్ణ, పవన్‌కుమార్ ప్రసాద్, రాధాకృష్ణ హాజరయ్యారు,

జంతు సంరక్షణ దినోత్సవం

వివిధ జంతువుల వేషధారణలో విద్యార్థులు

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 4: నగరంలోని రెజోనెన్స్ శ్రీనగర్ పాఠశాలలో అంతర్జాతీయ జంతు సంరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. అడవులను రక్షించండి, జంతువులను కాపాడండి అంటూ విద్యార్థులు వివిధ జంతువుల వేషధారణలో ఆకట్టుకున్నారు. పాఠశాల డైరక్టర్ కొండా శ్రీధర్‌రావు, కొండా కృష్ణవేణి, ప్రిన్సిపాల్ ప్రసన్నరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాస్త్రీయ నృత్య పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

విద్యార్థినితో కరస్పాండెంట్

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 4: నగరంలోని న్యూ టైనిటాట్స్ పాఠశాలకు చెందిన 4వ తరగతి విద్యార్థిని భువనచంద్రిక శాస్త్రీయ నృత్య పోటీలలో పాల్గొని విజేతగా నిలిచిందని పాఠశాల కరస్పాండెంట్ శెట్టి భాస్కర్ తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా వరంగల్‌లో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిందన్నారు. ఉపాధ్యాయులు అభినందించారు.

కల్లబొల్లి కబుర్లు నమ్మొద్దు

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ, పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

- **రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్**
- **రఘునాథపాలెం మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

రఘునాథపాలెం, అక్టోబర్ 4: కాంగ్రెస్ పార్టీకి పవరిస్తే..మన వ్యవసాయానికి పవర్ కట్ అవుతుందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. బుధవారం వేపకుంట్ల, గణేశ్వరం గ్రామాల్లో పర్యటించిన మంత్రి పలు అభివృద్ధి పనులను బుధవారం ప్రారంభించి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చెప్పే కల్లబొల్లి కబుర్లను నమ్మవద్దన్నారు. దేశాన్ని, రాష్ట్రాన్ని 75ఏళ్లు పాలించిన కాంగ్రెసోళ్లు నాడు చేయని అభివృద్ధి.. ఒక్క అవకాశం అంటూ మరోమారు జనాన్ని మోసం చేసేందుకు వస్తున్నారన్నారు. నాలుగున్నర ఏళ్లలోనే కనీవిని ఎరుగని రీతిలో గ్రామాలు అభివృద్ధి సాధించాయని, ప్రజలు గమనించి వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకే పట్టం కట్టాలన్నారు. మరోమారు అవకాశం ఇస్తే సమస్యలే లేని రఘునాథపాలేన్ని తయారు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఎన్నికలు వస్తున్నాయని ఉత్తర కుమారులు గ్రామాల్లో పర్యటనకు రెడీ అవుతున్నారని, సమస్యలపై నిలదీయాలని సూచించారు. మరో నెలరోజుల్లోనే ఎన్నికల సందర్భంగా మరోమారు మీ ముందుకొస్తానని..కారు గుర్తుకు ఓటేసి అఖండ మెజారిటీ ఇచ్చి గెలిపించాలని ఆకాంక్షించారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరెలు, గ్రామ యువకులకు క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, ఎంపీపీ భూక్యా గౌరి, జడ్పీటీసీ మాలోతు ప్రియాంక, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అజ్మీర వీరూనాయక్, మాజీ జడ్పీటీసీ కుర్రా భాస్కర్‌రావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పిన్ని కోటేశ్వరరావు, వైస్ ఎంపీపీ గుత్తా రవి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మాదం శెట్టి హరిప్రసాద్, ఎంపీటీసీ ఉప్పెర్ల వనజారాణి, బీఆర్ఎస్ నాయకులు బండి నాగేశ్వరరావు, ఉప్పెర్ల కొండల్‌రావు, సర్పంచ్‌లు ధారా శ్యాం, యాసా నీలిమ, మెంటెం రామారావు, కూరాకుల నాగేశ్వరరావు, యాసా రామారావు, రమేశ్, డీఆర్‌డీఏ పీడీ విద్యాచందన, తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చేందుకే 'గృహలక్ష్మి'

మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, అక్టోబర్ 4: పేదవాని సొంత ఇంటి కలను సాకారమయ్యే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో గృహలక్ష్మి పథకం ద్వారా మంజూరైన ఉత్తర్వుల పత్రాలను లబ్ధిదారులకు బుధవారం పంపిణి చేసి మాట్లాడారు. నియోజకవర్గంలో 2,500లకు పైగా డబుల్ బెడ్ రూమ్ ల నిర్మాణం చేపట్టి పేదవారికి అందజేశామని, 4 వేల మందికి గృహలక్ష్మి పథకం కింద జాగా ఉన్న పేదలకు ఇంటి నిర్మాణానికి రూ. 3 లక్షలు అందజేస్తున్నట్లు వివరించారు. గృహలక్ష్మి పథకం కింద సొంత స్థలం కలిగి ఇల్లు నిర్మించుకునేందుకు జిల్లాలో 15,500 మందికి లబ్ధి చేకూరనున్నదని, నియోజకవర్గానికి 3 వేల మందిని ఎంపిక చేశామన్నారు. గృహలక్ష్మి పథకం నిరంతర ప్రక్రియ అని, తెలంగాణలో సంపద పెంచి, పేదలకు పంచడమే సీఎం కేసీఆర్ ప్రధాన లక్ష్యమన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో దేశానికే తెలంగాణ ఆదర్శంగా ఉందన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, కార్పొరేటర్లు, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ మల్లీశ్వరి, అర్బన్ తహసీల్దార్ సిహెచ్. స్వామి, అధికారులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి పువ్వాడ

సంత దేవాలయ అభివృద్ధికి రూ.1.50 లక్షల వితరణ

దాతను సన్మానిస్తున్న దేవాలయ చైర్మన్

కారేపల్లి, అక్టోబర్ 4: మండల కేంద్రంలోని సంతశ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి కారేపల్లికి చెందిన మేదరి వీరప్రతాప్ తన తండ్రి మేదరి వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థంగా రూ.1.50 లక్షలను బుధవారం వితరణ చేశారు. తదేవాలయ చైర్మన్ అడ్డగోడ ఐలయ్య ఆధ్వర్యంలో స్థానిక ఎస్సై పుష్పాల రామారావుతోపాటు పాలకవర్గ సభ్యులు వీరప్రతాప్‌ను సన్మానించారు. ఇటీవల రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర నూతన ద్వజస్తంభాన్ని ఏర్పాటు చేయడానికి రూ.2 లక్షలు ఆర్థిక సాయం చేశారని అన్నారు. గ్రామస్తులు సురేందర్ మనియార్, తలారి చంద్రప్రకాశ్, ఎండీ హనీఫ్, అజ్మీరా వీరన్న, చక్రపాణి, తాజుద్దీన్, ఆదెర్ల రామారావు, గణితి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి చేయాలి : అడిషనల్ కలెక్టర్

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 4: మరికొద్ది రోజుల్లో పత్తి పంట మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉందని అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ మదుసుధన్‌నాయక్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఆయన సీసీఐ పత్తి కొనుగోళ్ల ఏర్పాట్లపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఖమ్మం, మధిర, నేలకొండపల్లి, వైరా, ఏన్కూర్, మద్దులపల్లి మార్కెట్‌లలో భారత పత్తి సంస్థ కేంద్రాలను ఏర్పాటుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు సీసీఐ మద్దతు ధర పొందాలంటే నాణ్యమైన పంటను తీసుకరావాలన్నారు. గ్రామ, మండల వ్యవసాయశాఖ అధికారుల వద్ద ఆధార్ నమోదుతో కూడిన పంటసాగు ధృవీకరణ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి ఎంఏ అలీం, వ్యవసాయశాఖ అధికారి ఎం విజయనిర్మల, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ ఆర్ మల్లేషం, ఆయా మార్కెట్ కమిటీ సెక్రటరీలు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, పత్తి ఖరీదుదారులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్, పాల్గొన్న అధికారులు

అభివృద్ధిని అడ్డుకుంటే ఊరుకోం..

- **మంత్రి అజయ్ ఆధ్వర్యంలో ఖమ్మం అభివృద్ధి**
- **విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు**

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పగడాల నాగరాజు

ఖమ్మం, అర్టోబర్ 4 : కాంగ్రెస్ నాయకులు తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని, ఖమ్మంలో ఉన్న ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టాల నిచూస్తే ఊరుకోమని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. నగరంలోని మంత్రి పువ్వాడ క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, కమర్తపు మురళి, మక్బుల్, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్‌తో కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఖమ్మంలో ఇప్పటికే మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో దాదాపు 2 వేల డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేదలకు ఇవ్వడం జరిగిందని, పూర్తి పారదర్శకతతో లబ్దిదారులను ఎంపిక చేసి పేదలకు కేటాయించామన్నారు. మంత్రి పువ్వాడ ఆధ్వర్యంలో ఖమ్మంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్ నాయకులకు మతి భ్రమించిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఖమ్మం నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ నాయకులకు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కాంగ్రెస్ నాయకులు అబద్దాలను ప్రచారం చేస్తూ వంకర బుద్ధితో అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇటీవల మంత్రి కేటీఆర్ 1360 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసినది కాంగ్రెస్ నాయకులకు కనపడక పోతే కంటి పరీక్షలు చేయించుకోవాలని అన్నారు.

రేగులచలకలో డీపీవో ఆకస్మిక పర్యటన

రికార్డులు తనిఖీ చేస్తున్న డీపీవో

రఘునాథపాలెం, అక్టోబర్ 4: జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్ బుధవారం రేగులచలక గ్రామ పంచాయతీని ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పలు సమస్యలపై కార్యాలయానికి వచ్చే గ్రామస్తులతో ముచ్చటించారు. సర్పంచ్ కొర్ల పాటి రామారావు, కార్యదర్శి సంగీత తదితరులు పాల్గొన్నారు.